# ★ పరిణామం ★

ఆయాపిళ్ళ సత్తిబాబు.

[ప్రేమకోసం ప్రాణత్యాగం అంత మంచి పనికాదు. అలా త్యాగం చెయ్యటానికి 'మానవు' లంత పిచ్చివాళ్ళు కారు. ఒడుదుడుకులు ప్రకృతికే వస్తాయ్. మానవు డేమాత్రం!— Life is for living అనే రాజనీతి పాఠకుడు బాగా గ్రహించుకోవాలి]

★

మూర్తి నరసుకూడ అలసిపోయేటట్టు అంతవరకూ ఆడి అప్పుడే చతికిలబడ్డారు యిసుక తిన్నెల్లో. నుదుటపై చెమటబిందువుల్ని తుడుచుకుంటూ అందినరసు.

"అయితే బావా మరి నువ్వు మా యింటికి రావూ?"...

"ఎందుకు?"—

"ఊరకనే"-అంతకన్న ఏమని చెప్తుంది?- స్త్రీపురుషులు ఒకళ్ళ నింకొకళ్ళు కలుసుకోవాలని కోరుతారు. భార్యా భర్తలు ఒడుదుడుకులులేని సంసారజీవితానికి ప్రయత్నిస్తారు. ప్రేయసీ ప్రియులు ఏకమేనుగా జీవితాన్ని సాగించటానికి పూనుకుంటారు. ఆమె అందుకే—పిలిచిందేమో?- "వొస్తాలే"—

నరస ముఖం వికసించింది. అయినా సంతోషాన్ని కప్పిపుచ్చింది. "అబద్ధాలు!"—

"నిజం!—తప్పకుండా వస్తాను"—

"నువ్వు దొంగవి—నాకు తెలుసులే"—

"పోనీ—అంతనమ్మకపోతే" — వేళాకోళంగా వెనక్కు తిరిగాడు,

"అయితే—లే"—నరసు లేచింది.

"అప్పుడే?—కూర్చో వెళదాం"—నరసు చెయ్యిపట్టుకుని కూర్చోపెట్టాడు.

"అయిందా? — మాట నిలుకడ — మరెప్పుడు?"——

మూర్తి జబాబుచెప్పలేదు. జవాబు నోటి చివరవరకూ వచ్చింది. అతడి పెదిమలు మాత్రం నవ్వుకున్నై—

"చెప్పు బావా?—ఎప్పుడొస్తావోను!"— ఆమె కంగించింది.

"చెప్పనా"—?

ఊఁ—

చెవిలో మెల్లిగా చెప్పాడు "నీ పెళ్ళికి—",

నరసు బుంగమూతిపెట్టి పక్కకు తిరిగింది.

"నాకు తెలుసును- నువ్వు దొంగవి"—

"ఏం?—అబద్ధమాడేనా"—

నరసు మాట్లాడలేదు. కోపంగా కూర్చుంది పక్కకు తిరిగి. నరసు కోపాన్ని హతమార్చటం మూర్తి బాగా నేర్చుకున్నాడు. ఆమెజటను ఆడిస్తూ అడిగాడు. "ఇప్పుడే రమ్మన్నావా?"—

"ఒద్దులే"—ఆమె చెయ్యి విదలించుకుంది.

"వొస్తానన్నానుగా"—

నరసు వెనకచూడకండా లేచింది. "అయితే —రా—"

"కూర్చో నరసూ! చీకటిపడగానే వెళిపోదాం. అప్పుడు మన్నెవరు చూడరు".

"నిజంగా—వొస్తానంటే!"—

"వస్తాను కాని—మీ అమ్మ చూస్తే"—?

"పాఠం చెప్పటానికి వొచ్చావని చెప్తాను"-

"మరో మేష్టర్ని మీఅమ్మ ఏర్పాటుచేస్తుంది".

మూర్తి చెప్తున్న సమాధానాలన్నీ సరిగానే వున్నాయి. అయినా నరసుకు తృప్తి కలుగలేదు.

"పోనీ—నీకంత భయమయితే నేనే మీ యింటికి వస్తానులే"—

"ఒద్దు నరసూ.? నీకు తెలీదు మన పెద్దల పోట్లాటలు కావేషీలు—మా అమ్మతో మీ నాన్న కూడ మాట్లాడడు. నీవు మాయింటికి వచ్చావని తెలుస్తే, మీ అమ్మ నిన్ను మళ్ళా శిక్షిస్తుంది".

వాళ్లు మాట్లాడుకోకపోతే నువ్వు కూడ నాతో మాటలుమానేస్తావా— ? పోనీ- నీకంత కోపమయితే— నేనొక్కర్తను ఈ గోదావరిలోపడి చచ్చిపోతాలే"—నరసు రెండుచేతులమధ్యా తల పెట్టుకుని బోర్లా ఇసుకలో పడుకు్కంది. నరసు యీమాటు నిజంగానే ఏడుస్తూంది.

"నరుసూ"—ఆమె తల నిమురుతూ పిలిచాడు.

"నాతో-మా-ట్టాడఖ్లేదు" — వెక్కుతూంది.

నరసును వొళ్ళోకి లాక్కుని లాల్చీ చివరతో కంటినీరు వొత్తాడు.

"నువ్వు ఎప్పుడూ నా దగ్గర యిలా కూర్చోపూ".

మూర్తి ఈ విషయంలో ఆమెను సరిగా తృప్తిపరచలేకపోయ్యాడు. ఈ విషయం రాకనేపోవాలి; వచ్చింతర్వాత ఆమె తన మొండిపట్టు విడవదు.

"నువ్వు వొట్టి పిచ్చిదానివి. ఎప్పుడూ నేను నీదగ్గర ఎలావుంటాను చెప్పు. నువ్వు పెద్దదానవయాక—మొగుడి దగ్గిరకు వెళిపోవూ? "—

"మొగుడా ?! — మొగుడంటే 'బావే' కద్యూ ? — " కంటి రెప్పలాడిస్తూ అతనివైపు చూసింది.

"కాదు నరసూ—మొగుడికీ బావకూ చాల దూరం. అందులోకి నాబోటి అభాగ్యుడికిమరీను-" అతడికంట్లో నీళ్ళూరాయి. ప్రక్కకు మొహం తిప్పేసుకున్నాడు. సూర్యుడు పూర్తిగా అస్తాద్రిలో మునిగిపోయ్యాడు. ఒక్కటొక్కటిగా పిట్టలు గూళ్లకు చేరుతున్నై. నీటి పడవలన్నీ వొడ్డుకు జట్టుగా వొస్తున్నాయి.

మూర్తి అన్నాడు—"చీకటిపడిపోయింది-"

"నేనిక్కడనే కూర్చుంటాను" — అతడి వొళ్ళో మరింత పొందికగా కూర్చుంది.

"ఎంతవరకూ ?"—

"మా ఇంటికి నువ్వు వొచ్చేవరకూ"—

మూర్తికి ఆమెను తృప్తిపరచటం అసంభవమయింది. నరసుకు రెండే రెండు గుణాలున్నై. అవతలవాళ్లు కోపగిస్తే ఏడుస్తుంది, అలుగుతుంది. లేకపోతే మంకుపట్టు పడుతుంది.

"అయితే నడుపూ. ఇంటివరకూ వస్తాను"-

ఆమె అసంతృప్తిగా లేచింది. చేతులు కలుపుగునీ వెళ్లిపోయారు.

నరసు మూర్తి స్వయాన మేనత్త మేనమామ పిల్లలు, మూర్తికి 15 ఏళ్లుంటాయి. లోకంయొక్క చరిత్రను కొంతవరకు చవిచూచాడు. నరసు 10 ఏళ్ల బాలిక. లోకం ఏమిటో తెలియకపోయినా- తెలిసినట్టు గర్విస్తుంది. మూర్తి తండ్రి అతడి చిన్నతనాన్నే గతించాడు. కొద్దిపాటి మాగాణీ మాత్రం వారికి జీవనాధారంగా వుంది. మూర్తితండ్రి గతించినప్పటినుండీ మేనమామ యింటనే వుంటున్నాడు తల్లితోకూడ. మూర్తి మేనమామ మాత్రం అట్టే డబ్బున్న మనిషికాడు. దానికితోడు ఇంట్లో కుటుంబం పెరిగిపోయింది. ఓత్తి పిల్లకోడి అయిపోయాడు. అంచాత డబ్బంటే ఓవిధమయిన ఆశఏర్పడింది. దానికితోడు భార్యాప్రోత్సాహం ఎక్కువయింది. భూములు తనపేర వ్రాస్తేనేకాని పోషించటానికి కష్టంగా వుంటుందని మూర్తితల్లితో (చెల్లెలితో) చెప్పాడు. చూచూస్తూ భూములు అతడిపేర ఎలా వ్రాస్తుంది?- వ్రాసినతరువాత అతడు పోషణ కర్తవ్యం తీసుకోకపోతే ?- అనాడే వారికి వేరుకాపరం

గలిగింది. మూర్తి మేనమామ చాల విచారించేడు. అనాథయైన చెల్లెలకు తనింట్లో వుంచుకుని ఆదరించటానికి బదులు డబ్బుకక్కుర్తికి వెళ్లగొట్టేశాడు. మూర్తి నరసుల ప్రేమను చూసి మురిసిపొయ్యేవాడు. ఇప్పటికీ అతనికి తెలుసును మూర్తి నరసు చాల అన్యోన్యంగా వుంటున్నారని. అయినా- అతడేం చేస్తాడు— భార్యాభటుడు!!— మూర్తి మేనత్త చాల ఏవగించుకొనేది వాళ్ళనుచూసి. ఆమెకు ఈర్ష్యాగుణం ఎక్కువ. ఇన్నాళ్ళూ తనపోషణక్రింద వుండీ ఈనాడు డబ్బుదగ్గర బాంధవ్యం తెంపుకుని తనదికాదని వెళ్ళిపోయారని నల్గురతోను చెప్పేది. భర్తను కూడ చాల ఖరాఖండీగా వాళ్లకు ఎటువంటి సహాయము చేయకుండా వుండటానికి తగిన కట్టుదిట్టాలు చేసింది.

* * *

అప్పటే స్కూలువదిలారు. ఆర్నెల్లు శిక్షలనుభవించిన 'జయిలర'ర్లే యీవలకొచ్చారు పిల్లలంతా. ఒకళ్ళకోసం ఇంకొకళ్లు తహతహపడుతూ ఎవరిజట్టును వాళ్లు తీసుకుపొయ్యారు. మూర్తి నరసు కూడ దూరాన్నుంచే ఒకళ్ళమొహాల్లు చూచుకున్నారు. నాలుగుకళ్ళూ కలుసుకున్నై. పలకరించుకున్నై. నరసు ముందుకునడచి వెళ్లిపోయింది, మూర్తి ఆమెను అనుసరిస్తూ పిలిచాడు. ఆమె వినిపించుకోలేదు. ఇంకా వడిగానడిచింది. ఇలాటి సంఘటనలప్పుడు జరుగుతూవుంటై. ఆరోజున ఏదో ఓ కొత్తవిశేషం వుంటుంది.

మూర్తి మరీ వడిగానడిచి ఆమెను దూసుకుని ముందుకు పొయ్యాడు. నరసు పక్కకు తిరిగి పోయింది. మూర్తి ఆగలేదు. నరసు ఓరగా చూచింది వెనక్కు, మూర్తి నిజంగానే వెళ్లిపోతున్నాడు వెనక్కు తిరిగేనా చూడకుండా. నరసు పరుగెత్తింది. మూర్తికూడా పరుగెత్తి వొక్కఊదుటను ఇసుకతిన్నెల్లో పడ్డాడు. నరసూ ఒగర్చుకుంటూ అతనివెనకాలే పరుగెత్తి అక్కడనే కూచోబడిపోయింది. ఒకరినొకరు చూసుకుని నవ్వుకున్నారు. మాటాడుకోలేదు, ఇద్దరుకూ పట్టుదలగానేవుంది మాటలవిషయంలో. కబ్బాశేబులో చేగోడీలు తీసి ఒక్కటి నోటిలోవెట్టుకుని తక్కినవి మూర్తికిచ్చింది. అతడూ మౌనంగా పుచ్చేసుకుని యిసుకలో పడుకున్నాడు. పక్కగా చేతినానుకుని. నరసుకూడ అతనికెదురుగా పడుక్కుంది.

'ఓ, మాంచి సంగతి'—మీదికిచూస్తూ అంది నరసు ఎవరితోనో మాట్టాడుతున్నట్టు.

"ఏంవిటో? —" ఇంకోపక్కకు తిరిగి అన్నాడు ఎవరినో ప్రశ్న వేస్తున్నట్టు.

"నవ్వినవాళ్ళతో చెప్పను—"

"ఏశ్చేటంతటి కబురా—"

మాటలు కలిశాయి.

"నువ్వు నవ్వనంటె చెప్తాను."

"నవ్వను".

నిజంగా?—

ఊఁ—

ఆమె మెల్లిగా చెప్పింది. "నాకు పెళ్ళి అవుతుందట—"

నరసు హాస్యమాడుతూందనుకుని పకపకా నవ్వాడు మూర్తి.

అదిగో నవ్వావుకదూ—నీకంతా హాస్యంగా వుందనమాట నాపెళ్లంటే—

"నీకు పెళ్లిఅవుతుందని ఎవరు చెప్పారు" నవ్వుతూ అన్నాడు.

"ఎవడో లక్షింపతి—నీకెందుకు—"

"చెప్పదూ"—

"మా నాన్న—"

మూర్తికి సంశయంతీరింది. "నీమొగుడెవరు?"

ఆమె సిగ్గుపడలేదు. ధీమాగానే చెప్పింది. "ఎవరో బూరకాలు బుచ్చన్నావధానట! రొండూ ఏనుగుకాళ్లే!— నన్ను చూసి పిల్ల బావుందని మా అమ్మతో చెప్పి— అయితే అమ్మాయి నన్ను పెళ్లాడుతావా అని చేతిలో మూడు రూపాయలుంచాడు.

ఇవిగో...టి "రూ-పా-యలు" అంది నరసు కబ్బాజేబులో రూపాయలు పైకితీసి మూర్తిని పూరిస్తూ—

మూర్తి హృదయం దుఃఖంతో నిండిపోయింది. అయ్యో! భర్తంటే ఏమిటో తెలియని అజ్ఞానదశలో వున్నపిల్లను 50 ఏళ్లు పైబడిన వృద్ధుడికిచ్చి వివాహంపేరిట శృంఖలాలు తగిలించబొయ్యే మూర్ఖపు తలిదండ్రుల నేమనాలి?— దీన్నంతటిని అంగీకరిస్తూ ఊఁకొట్టి ప్రోత్సాహమిస్తున్న దుర్మార్గపు సంఘాన్ని ఏమనాలి?— రేపే- దేశంలో అనాథ లెక్కువవుతున్నారని స్త్రీలలో వ్యభిచారం జరుగుతూందని వేలుపెట్టి చూపె పాడులోకాన్నేం చేయాలి"—ఆగలేక వొస్తూన్న దుఃఖాన్ని దిగమ్రింగుతూ మీదికి చూశాడు మూర్తి. ఆనిర్మలాకాశంలో అర్థచంద్రుడు దగ్గరగావున్న తారాగణం కోసం ప్రాకులాడుతూన్నాడు. అతడు పోయినంత దూరం తారలుకూడ అతనికి చిక్కకుండా తిప్పలు పెడుతున్నై—

"అయితే నీకు రూపాయలు వొద్దూ" ఆమె అడిగింది.

దానికి జవాబు చెప్పలేదు కాని ఓ ఎదురు ప్రశ్న వేశాడు.

"నీవు అంగీకరించావూ పెళ్లికి—" ఆమె అంగీకరించిందని అతడికి తెలుసును. లేకపోతె ఆమె అంతఆనందాన్ని తెలియపరచదు.

"ఊఁ—" సాగదీస్తూ తలవూపింది జోరుగా నే—

"ఎందుకు?—

ఆమె నవ్వింది "నీ దొంగమాట నిలబెట్టుకుంటావో లేదోఅని"

"ఏమిటి?—" ఆశ్చర్యంగా అడిగాడు.

"మరచిపోయావు—నా పెళ్లికి నీవు వొస్తానన్నావు కదూ".

పూర్తిగా అర్థమయింది మూర్తికి. ఆమె యింత అమాయకంగా వుంటుందని అతడనుకోలేదు. ఓ వేళ ఆమెకు ఇష్టంలేకపోతేమటుకు వివాహానికి అడ్డేముంది?- పెద్దలు తలపెట్టిన కార్యం! "పెళ్లి అంటే ఏమిటనుకున్నావు" ఆమె వూహ ఎలావుంటుందో తెలుసుకోవాలని అడిగాడు.

నాకు తెలీదనుకున్నావేమిటి?- బాజాబజంత్రీలు వస్తాయి—పల్లకిలో నన్ను ఊరేగిస్తారూ— మరంటే-నువ్వు కూడ నాప్రక్కను కూచుంటావా?- అతడి మొహంలోకి చూసింది.

"ఆఁ—వొస్తాలే—" అంతకంటె అతడు మరేమి అనలేదు. నరసుకు కోపం తెప్పించి మాట్లాడించటమంటె మూర్తికి సంతోషం. కాని ఇప్పుడామెతో మాట్లాట్టానికి—ఆమెకు కోపం తెప్పించటానికి అతడికేమి మనస్సొప్పలేదు—అవును ఎలావుంటుంది? పుష్పించి ఫలింపవలసిన జీవితకుసుమాన్ని కళ్లువిడని చిన్నతనంలోనే త్రుంచిపారేస్తుంటే- ఇంకెలావుంటుంది. మూర్తి సరిగా జవాబు చెప్పకపోవటం నరసు గ్రహించుకుంది. అతడికి కోపంవచ్చిందని.

"కోపం వొచ్చిందా?-" అతని వొళ్లో కూర్చుంది.

"లేదు—"

ఆమె అతడి కళ్లల్లోకి చూసింది. మూర్తి కంటినిండా నీళ్లున్నాయి.

"ఏడుస్తున్నావా బావా"—

"లేదు"—మొఖాన్ని ప్రక్కకు తిప్పేసుకున్నాడు.

రాత్రి పక్షులు ఆహారంకొరకు బయల్దేరినయి. జనసమూహం గృహాలకు మళ్లుతున్నారు. నీటిపాటు పోట్లతో చంద్రుడు ఉక్కిరిబిక్కిరి అవుతున్నాడు.

నరసుఅంది "భయంగా వుంది బావా"—

"పోదాం పద"— మూర్తి నరసు వెళ్లిపోయారు.

* * *

కాలచక్రం పదేళ్లు గిర్రునతిరిగాయి. అందులోని మార్పు సంచలనరాహిత్యంగా పడివుండే ప్రతి

ప్రమాణువులోను స్పష్టంగా గోచరమవుతుంది. అది ప్రకృతిస్వభావం!—

కాలపరిభ్రమణంతోపాటు నరసును అన్ని విధాలా మరచిపోటానికి ప్రయత్నించాడు మూర్తి. అది ప్రకృతివిరుద్ధం!!— చిరునవ్వుతో, ముద్దుల మూటగట్టే మోముతో నడుస్తున్నప్పటికి అతని కళ్ళల్లో నాట్యమాడేది నరసు. కలల్లో కనుపించి "బావా" అని పలుకరించేది. అయినా హృదయ పరివర్తనంవల్ల కొంతవరకు ఆమెను మరిచిపోగలిగాడు. కాని ఓవిషయంలో మాత్రం నరసును గురించి అతడి హృదయం వేగిరపడేది. ఎప్పుడయినా నరసు కనిపిస్తే- ఆమెకు తన హృదయాశీస్సులను అందచేయటానికి తహతహపొందేడు, కాని ఇంతవరకు అది కొనసాగలేదు. ఆ సుభసమయం కొరకు అతడి కళ్లు ఎక్కువ ఆతృత చెందేవి.

విశాఖపట్నంలో కోర్టుపని చూసుకుని బసకు వెళ్తున్నాడు మూర్తి. వెనుకనుండి నీరసంగా ఓ సన్నని అపరచిత కంఠస్వరం వినిపించింది "బావా"—

అతడు వెనుక తిరిగి చూచాడు-"నరసు!!- గుమ్మంమీద నుంచుంది, "నరసూ—" అతడు గబగబా మెట్లెక్కి ఆమెను కౌగలించుకోబొయ్యాడు. ఆమె ప్రక్కకుతప్పుకుంది. ఆ వేదనకు చాల సిగ్గుపడ్డాడు మూర్తి.

"నరసూ—" మరి పలుకలేకపొయ్యాడు. హృదయం దుఃఖంతో నిండిపోయింది, రెప్పలు మాత్రం టపటపా కొట్టుకున్నయి యోగక్షేమాలు వివరించేలా.

"బావా! క్షేమంగా వున్నావా?

ఆఁ- క్షేమంగానే వున్నాను. దౌర్భాగ్యుణ్ణి- వుండకేంజేస్తాను-? కాని- నరసూ చాలనీరసించావు ... పోల్చుకోలేకపొయ్యాను. రాజమండ్రీ నుంచి యింతదూరం వచ్చేశావా?- శరీరం చాల మారిపోయింది...—

ఆమె జాలిగా అతడికళ్ళల్లోకి చూసింది అతడి కన్నులు పూర్తిగా అశ్రుపూరితములయాయి. ఆ మెల్లో పూర్వంపటుత్వంలేదు. ఆకళ్ళల్లో పూర్వపు జిగిలేదు, పెదిమలు పూర్తిగా ఎండిపోయాయ్. మాటల్లో జీవంలేదు. ఒక్తి 'ఎడారి' లావుంది ఆమె ముఖం-!- దుఃఖాన్ని గట్టిగా ఆపుకుంటూ అన్నాడు మూర్తి "నరసూ- ఇక్కడేనేమిటి నువ్వుంట?"-

"ఆఁ- ఇక్కడనే బావా! ఇదే మాయిల్లు-"

"...నీభర్త ఇంట్లో వున్నాడా?-

"వీధిలోకెళ్ళారు- వొచ్చేవేళ కూడ అయింది ...బావా...!" దుఃఖంచేత మొహాన్ని రెండుచేతులతోను కప్పుకుని పక్కకు తిరిగింది. తనని కూర్చోమని చెప్పటానికి నరసు దుఃఖిస్తూందని మెల్లిగా అక్కడనే కూర్చున్నాడు.

"బా...వా!—" ఆమె పిలిచింది.

ఏడువకు నరసూ—...అక్కడ కూర్చో!—

"వొ-ద్దు బావా...నువ్వు... వెళిపోవూ!-"

అతడాశ్చర్యంగా ఆమెవేపు చూశాడు. ఏమిటి?- విపరీతం? నరసేనా ఆ మాట్లాడుతున్నది? ఎల్లప్పుడూ తనదగ్గరే- తనతో కబుర్లుచెప్తూ- ఆడుకుంటూ వుండమని కోరిన తన ముద్దునరసయేనా— వెళ్లిపోమంటూన్నది—"సరసూ"—

ఆమె తలఎత్తలేదు.

ఎన్నాళ్ళనుండో నీకోసం తిరుగుతున్నాను. నువ్వు కనిపించలేదు. నీ వివాహానికి కూడ రాలేకపోయాను. నువ్వు ఈప్రాంతాల్లో వున్నావనీ- కొద్ది కాలంకిందటే తెలిసింది. కాని ఈ విశాఖపట్టణంలో ఇంతమారుమూల జీవితాన్ని సాగిస్తున్నావనుకోలేదు. అబ్బ- నాకళ్లలో ఎప్పుడూ నీ చిన్నరూపే నృత్యంసలిపేది. నీ ముద్దుమాటలే మారుమ్రోగేవి. ఆ తెల్లని చంద్రకిరణాల్లో దూదిపింజల్లాంటి గోదావరి ఇసుకతెన్నెల్లో- మనం ఆడిన ఆటలే—

"అదిఅంతా చెప్పి నన్నెందుకు కలవరపరుస్తావు బావా? నిన్ను వెళ్ళిపోమన్నందుకు నన్ను క్షమించవూ!!-"

ఆఁ, అప్పుడే? ... నీతో...కొన్ని నిముషాలు— నా హృదయతాపం—

నాకు తెలుసును బావా నీ ప్రేమ, అదిఅంతా మరచిపోవూ—అనంతవిశాలమైన ప్రకృతి- ప్రపంచంలో శాశ్వతస్థావరం ఏర్పరుచుకున్నా- మార్పు సహజం!- అదే నాజీవితంలో మార్పుకు కూడ... నాభర్తవుండే... యౌవన వాసనకట్టడు... అందుకే నా యీ నీరసానికి- కారణం. నీతో చెప్పకూడదు. ఆవిషయాన్ని- అయితే అతని అభిప్రాయానికి భిన్నంగా ప్రవర్తించటం నాకిష్టంలేదు. అలా ప్రవర్తించటం వుత్తమగృహిణి ధర్మంకాదని నా అభిప్రాయం— భర్తకు ద్రోహంచెయ్యటం- పూర్వపురుషుల ప్రేమకు శరీరాన్ని త్యాగంచెయ్యటం- ఎక్కడో?— అలాఅయితే- కట్టుకున్న భర్త- కని పెంచిన తలిదండ్రులు- ప్రేమపూర్వకంగా, ప్రాణాలనే అర్పించవలచుకొన్న పూర్వపురుషుడు ఏమై పోవాలి? --- ఎక్కడయినా అల్లాటివి జరిగితే. స్త్రీలోకానికి తీరనిమచ్చ.—

దూరంగా ఓ ముసలివ్యక్తి ఎముకలపోగు శరీరంతో దగ్గుకుంటూ చేతికర్ర ఆనికతో తూలిపోతూ వస్తున్నాడు.

"అ-ది-గో...అతనే...నా భ-ర్త"—

"ఆఁ...అతడే...నా నీ భర్త"—

ఔను!—అ-త-డే-! నీవు వెళ్లిపోవూ-- నా క్షేమం కోరినవాడవయితే వెళిపో-వూ!-... వెళిపో బావా!" ఆమె తొందర చేయసాగింది.

"సౌభాగ్యవతీభవ!"—అతడింకా చాల వరకూ మాట్లాడదలచుకున్నాడు. ఎంతో ముద్దుగా చిన్ననాటి విషయాలను ముచ్చటిద్దామనుకున్నాడు ...కాని...కాని...వరసు ఇంత హీనస్థితిలో వుంటుందనీ- స్త్రీ అస్వతంత్రినీ- పురుషుడిలో ఇంత స్వార్థపరత్వం వుంటుందనీ- అతడెన్నడూ అనుకోలేదు. ఇంతహీనంగా వున్నా ఆమె అతన్నే మనసులో పూజిస్తూంది!!- ఇంతకూ అతడి కోరిక నెరవేరింది. హృదయాశీస్సులు అందచేయగలిగాడు. మూర్తి మెట్లుదిగి ముందుకు నడిచాడు—

"బావా-" తలుపు రెక్కలమాటుకు పోయి పిలిచింది.

"ఏం?"- అక్కడనుంచే అడిగాడు—

"మరి...నువ్వు...ఇక్క...డకు రా-కూ" ఆమె దభేలున తలుపులు మూసింది.

ఒక్కసారి అంధకారం ఆవరించింది.

దూరంగా- నల్లాకాశం భూమ్మీద వొరిగిపోయింది.

గండుకోతుల అరుపు భయంకరంగా ప్రతిధ్వనిస్తూంది.

చేతిపనుల
వర్తక రహస్య బోధిని

సబ్బులు, సెంటులు, పరిమళ తైలములు, బాణసంచ, అత్తరు, పన్నీరు, పిప్పరమెంటు, మందులు మొదలగునవి సులభముగా తయారుచేయు పరిశ్రములు 500 గలవు. ధర 1 రూపాయి పోస్టు ఖర్చులు 5 అణాలు.

కుట్టుపని స్వబోధిని

కోట్లు, బ్రౌజులు, షర్టులు, జాకెట్లు కత్తిరించి కుట్టు కొత్తపద్ధతులు డ్రాయింగులతో గలదు. స్త్రీలు, పురుషులు, బాలికలు యీ గ్రంథము చూచి సులభముగా నభ్యసించతగినది. ప్రతి దర్జీ వారికిని ముఖ్యముగా చేతిలోవుండవలసిన పుస్తకము. ధర అ. 10.

మహారాజ పుస్తకశాల,

12, అరుణాచలమొదలి వీధి, 18, బీటు, మద్రాసు.